ఆ ఇండస్ట్రీ క్లస్టర్ల కథ కంచికేనా?

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో జపాన్, తైవాన్ ప్రత్యేక ఇండస్ట్రీ క్లస్టర్ల ప్రతిపాదనలు అయోమయం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీటి ఏర్పాటుకు ప్రణాళికలు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో జపాన్, తైవాన్ దేశాలకు ప్రత్యేక ఇండస్ట్రియల్ క్లస్టర్ల ఏర్పాటు ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత బీఆర్ఎస్ సర్కారు ఈ రెండు దేశాల కంపెనీల కోసం ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినప్పటికీ.. ప్రస్తుతం అది ముందుకెళ్లడం లేదని పరిశ్రమ వర్గాలు ఆరోపిస్తున్నాయి. క్లస్టర్లలోకి బడా కంపెనీలు వస్తే.. వాటికి అనుబంధంగా అనేక యూనిట్ల ఏర్పాటుకు వీలు కలుగుతుందని, ఫలితంగా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభించే ఆస్కారం ఉందని వారు చెప్తున్నారు.

ప్రతిభను అందిపుచ్చుకోవాలనే..

ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాల్లో జపాన్, అలాగే సెమీకండక్టర్ల పరిశ్రమలో తైవాన్ విశేషమైన ప్రగతి సాధిస్తున్నది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ రెండు దేశాల ప్రతిభను అందిపుచ్చుకోవాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. నాటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు అధికారులు దండు మల్కాపూర్ ప్రాంతంలో జపాన్ పరిశ్రమల కోసం 1,000 ఎకరాల్లో, తైవాన్ కంపెనీల కోసం మరో 1,000 ఎకరాల్లో ప్రత్యేక ఇండస్ట్రియల్ క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. అంతేకాదు టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో దండు మల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సమీపంలోని భూముల సేకరణకు కూడా చర్యలు చేపట్టారు.

కొత్త ప్రాంతం వైపు..

దండు మల్కాపూర్ ఎంఎస్ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఇప్పటికే దాదాపు 600 ఎకరాల్లో ఏర్పాటు చేయగా, మరో 600 ఎకరాల ప్రభుత్వ భూములు పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాయి. ఇవిగాక సమీపంలోని మరో 1,000 ఎకరాలను సేకరించేందుకు గతంలో చర్యలు చేపట్టారు. వ్యవసాయ యోగ్యం కానివే ఎంపిక చేశారు. పైగా అక్కడ ఇప్పటికే ఎంఎస్ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ కొనసాగుతుండటంతో దానికి సమీపంలోనే ఈ రెండు క్లస్టర్లు ఏర్పాటుచేస్తే వాటికి అనుబంధంగా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యే వీలుందని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. కాగా, ప్రభుత్వం మాత్రం ఈ ప్రాంతాన్ని కాదని ఫ్యూచర్ సిటీలో కొత్తగా ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఫ్యూచర్ సిటీలో వ్యవసాయ భూములను సేకరించాల్సి ఉంటుందని, ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యమేనా? అన్న ప్రశ్నలు వస్తున్నాయి.

బీఆర్ఎస్‌తోనే పారిశ్రామిక ప్రగతి

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మక విధానాలతోనే రాష్ట్రంలో పారిశ్రామిక ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా టీఎస్-ఐపాస్ చట్టం, అనేక ప్రోత్సాహకాలతో తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు గమ్యస్థానంగా మారింది. దాదాపు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, అనేక ప్రఖ్యాత కంపెనీలూ ఏర్పాటయ్యాయి. అయితే గత ఏడాదిన్నర కాలంగా సీన్ రివర్సైంది. దీంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

ఎకానమీపై వార్ ఎఫెక్ట్

భారత్‌కు ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం సెగ

అత్యంత కీలకంగా హోర్ముజ్ జలసంధి • మూసేస్తే ముడి చమురుకు ఇబ్బందే

సంక్షోభంలోకి దేశ ఆర్థిక వ్యవస్థ • ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు పైపైకి..

- 2022లో హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అయిన ముడి చమురు, ఎల్ఎన్‌జీ ఎగుమతుల్లో 82% ఆసియా దేశాలకు వచ్చినవే. 2022, 2023 జనవరి-జూన్‌లో జరిగిన ఎగుమతుల్లో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియాల వాటానే 67%.
- భారత్ ముడి చమురు అవసరాల్లో దాదాపు 90% దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో 40 శాతానికిపైగా హోర్ముజ్ జలసంధి మీదుగా మిడిల్ ఈస్ట్ దేశాల నుంచే వస్తున్నాయి.
- కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం దేశంలో ప్రస్తుతం సుమారు 74 రోజులకు సరిపడా చమురు నిల్వలున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద 40-42 రోజులు.. భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వద్ద 24 రోజులు.. భారతీయ వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్స్ లిమిటెడ్ వద్ద 9 రోజులకు సరిపడా ఉన్నాయి.
- ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతూపోతున్న ముడి చమురు ధరలు. గత వారం 7% ఎగిశాయి. అమెరికా బెంచ్‌మార్క్ క్రూడ్ బ్యారెల్ ధర 73 డాలర్లకు, బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75 డాలర్లను తాకింది. మునుపు ఇవి 65-70 డాలర్ల శ్రేణిలోనే ఉండేవి. సహజంగానే చమురు సరఫరాలో ఏదైనా అంతరాయం కలిగితే బ్యారెల్ రేటు 5 నుంచి 10 డాలర్ల మేర పెరుగుతూ ఉంటుంది.
- ప్రతి నెలా హోర్ముజ్ జలసంధి ద్వారా 3వేలకుపైగా నౌకలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో కేవలం చమురు, గ్యాస్ మాత్రమేగాక, మరికొన్ని కీలక వస్తూత్పత్తులు, మెటీరియల్స్ రవాణా కూడా ఉంటుంది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి.

ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం సెగ.. భారత్‌కు గట్టిగానే తగులుతున్నది. వార్ కొనసాగితే దేశంలో చమురు సంక్షోభమే మరి.

ముడి చమురు సరఫరాలో అత్యంత కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధి మూతబడితే.. మన ఆర్థిక వ్యవస్థ ఆగమాగమేనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయిప్పుడు.

న్యూఢిల్లీ, జూన్ 18: ప్రపంచానికి చమురే చోదకశక్తి. ఆ చమురు సరఫరా అత్యధికంగా గల్ఫ్ దేశాల నుంచే జరుగుతుండగా, ఇందులో ఎక్కువగా హోర్ముజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతున్నది. సరిగ్గా ఇదే.. ఇప్పుడు ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధాన్ని ప్రపంచ దేశాలు కలవరపడేలా చేస్తున్నది. అవును.. ఇజ్రాయెల్‌తో యుద్ధం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేయవచ్చన్న ఆందోళనలు పెరుగుతున్నాయి మరి. ఇరాన్ తీర ప్రాంతం పొడుగూత ఆనుకుని ఉన్న ఈ 33 కిలోమీటర్ల సముద్ర మార్గం మూతబడితే భారత్‌సహా ఆసియా దేశాలకు చమురు కష్టాలు తప్పవన్నది నిజంగా నిజం.

ఇదీ సంగతి..

ఇరాన్ అణు కార్యకలాపాలు తమకు ముప్పేనని భావిస్తున్న ఇజ్రాయెల్.. ఆ దేశంపై దాడులు మొదలు పెట్టింది. ఇరాన్ ప్రతిదాడులతో ఈ రెండు దేశాల మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చగా.. ఇప్పుడిది యావత్తు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్నే కుదిపేస్తున్నది. ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, కతార్, యూఏఈ, ఒమన్ దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న ఎన్నో దేశాల్లో గుబులు మొదలవుతున్నది. ఈ దేశాలన్నిటి సరిహద్దులు, ఇరాన్ దేశ సరిహద్దు మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధి మీదుగానే ఆయా దేశాలకు నిత్యం ముడి చమురు, ద్రవ రూప సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) ఎగుమతులు జరుగుతూ ఉన్నాయి. అయితే ఇజ్రాయెల్ దాడుల దృష్ట్యా ఇరాన్ ఈ జలసంధిని మూసేయాలని చూస్తున్నట్టు సమాచారం. దీన్ని ఆ దేశ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) సీనియర్ కమాండర్ సర్దార్ ఇస్మాయిల్ కోసారి సైతం ధ్రువీకరిస్తుండటం గమనార్హం.

భారత్‌కు దెబ్బ

దేశ చమురు అవసరాలకు దిగుమతులే ఆధారం. ఆ దిగుమతుల్లో సగానికిపైగా సౌదీ తదితర గల్ఫ్ దేశాలే దిక్కు. ఇవన్నీ కూడా హోర్ముజ్ జలసంధి ద్వారానే భారత్‌కు చేరుతున్నాయి. ప్రపంచ ముడి చమురు సరఫరాలో గల్ఫ్ దేశాల వాటా సుమారు 25 శాతంగా ఉన్నది. రోజూ 20 మిలియన్లకుపైగా బ్యారెళ్ల క్రూడాయిల్, 25% ఎల్ఎన్‌జీ హోర్ముజ్ గుండా సరఫరా అవుతున్నది. అయితే ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఈ మార్గంలో రవాణాకు ఆటంకాలు ఏర్పడితే వేల కిలోమీటర్లు తిరిగి చమురును దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల దేశీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమంటాయని, తయారీ ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణం విజృంభిస్తుందని మెజారిటీ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ ద్రవ్యోల్బణమైతే తగ్గిందని, ఆర్బీఐ వృద్ధిరేటుపై దృష్టిపెట్టి వడ్డీరేట్లను తగ్గిస్తూపోతున్నదో.. మళ్లీ అదే వడ్డీరేట్లను పెంచేస్తుందని, దీనివల్ల రుణాలు ప్రియమై అన్ని రంగాలు కుదేలవుతాయన్న ఆందోళనల్నీ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భారత జీడీపీ ప్రగతి.. ఈ యుద్ధంపైనే ఆధారపడి ఉందంటున్నవారూ లేకపోలేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఈ సమస్య భారత్‌లోనేగాక, ఎన్నో ఆసియా, ఐరోపా దేశాల్లోనూ తలెత్తుతుంది.

చమురు సరఫరాలో అంతరాయంతో భారత రిఫైనరీ కార్యకలాపాలు, రిటైల్ ఇంధన ధరలు, యావత్తు ఆర్థిక వ్యవస్థే ప్రభావితమవుతాయి. హోర్ముజ్ జలసంధిలో రవాణా ఆగితే షిప్పింగ్ ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణ సమయం పెరిగిపోతుంది. సంబంధిత బీమా ప్రీమియంలూ ఎక్కువే.

-నితిన్ తివారీ, ఫిలిప్‌క్యాపిటల్

ముడి చమురు సరఫరాలో హోర్ముజ్ జలసంధి చాలా కీలకంగా ఉన్నది. ఇది మూతబడితే గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు పెరగడం ఖాయం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం విజృంభిస్తుంది. ఫలితంగా ఇప్పుడిప్పుడే అన్ని దేశాల రిజర్వ్ బ్యాంకులు తగ్గిస్తూపోతున్న వడ్డీరేట్లకు బ్రేకులు పడుతాయి. అదే జరిగితే రుణ లభ్యత క్షీణిస్తుంది. పెట్టుబడులు కరువై అన్ని రంగాలు దెబ్బతింటాయి. చివరకు ఆర్థిక వ్యవస్థలో మందగమనం, మాంద్యం ఛాయలు కనిపిస్తాయి.

-అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్



మీ గూగుల్ క్యాంపస్ రెండెకరాలే!

మా ఇందిరా మహిళాశక్తి కేంద్రం మూడున్నర ఎకరాల్లో ..

గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ప్రారంభంలో సీఎం వ్యాఖ్యలు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): 'హైదరాబాద్‌లో గూగుల్ ఆఫీస్ రెండు ఎకరాల్లో మాత్రమే ఉంది. మా ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉంది. మా మహిళలతోనే గూగుల్‌కు పోటీ'.. ఇవీ బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్(జీఎస్ఈసీ)ను ప్రారంభించిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు. తెలంగాణ మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారని చెప్పారు. గూగుల్ ఇన్నోవేటివ్ సంస్థ అని, తమది ఇన్నోవేటివ్ ప్రభుత్వమని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటే ఒక నగరం కాదని.. ఒక భవిష్యత్తు అని అభివర్ణించారు. అంతర్జాతీయ టాప్ 10 టెక్ దిగ్గజాల్లో ఏడు హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, ఇతర దిగ్గజ సంస్థలు తెలంగాణతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

స్టాక్ మార్కెట్లపై యుద్ధమేఘాలు

ముంబై, జూన్ 18: స్టాక్ మార్కెట్లపై యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్-ఇజ్రాయిల్ దేశాల మధ్య యుద్ధం మరింత తీవ్రతరం కావడంతోపాటు అమెరికా ఫెడరల్ వడ్డీరేట్లపై ఈవారంలోనే నిర్ణయం తీసుకోనుండటం పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 138.64 పాయింట్లు కోల్పోయి 81,444.66 పాయింట్ల వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ 41.35 పాయింట్లు నష్టపోయి 24,812.05 వద్దకు చేరుకున్నది. దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ 1.79 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, నెస్లె, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ రంగ షేర్లు నష్టపోయాయి. కానీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 5.12 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.

సింగరేణికి ఐసీఎంఏఐ అవార్డు

గోదావరిఖని, జూన్ 18: సింగరేణి సంస్థకు అరుదైన గౌరవం లభించింది. సంస్థ అనుసరిస్తున్న వ్యయ నియంత్రణ చర్యలకు గాను జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. 2024 సంవత్సరానికిగాను ఇనిస్టిట్యూట్ ఆఫ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) అందజేసే పురస్కారాల్లో సింగరేణి సంస్థకు తృతీయ బహుమతి వరించింది. ఈ అవార్డుకు ఎంపికపై సంస్థ సీఎండీ బలరామ్ హర్షం వ్యక్తం చేశారు.

ఈసారి 6.2 శాతమే

దేశ జీడీపీ అంచనాకు ఇక్రా కోత

కోల్‌కతా, జూన్ 18: ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను దేశ జీడీపీ అంచనాను ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తమ తాజా ఔట్‌లుక్‌లో 6.2 శాతానికి తగ్గించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇది 6.5 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. రియల్ గ్రాస్ వాల్యూ యాడెడ్ (జీవీఏ) గ్రోత్ అంచనాను కూడా 6.4 శాతం నుంచి 6 శాతానికి కుదించింది. ఇక ద్రవ్యోల్బణం విషయానికొస్తే.. రిటైల్ ద్రవ్యోల్బణం 3.5 శాతానికిపైనే ఉంటుందని, టోకు ద్రవ్యోల్బణం 1.8 శాతంపైనే ఉండొచ్చని చెప్పింది. ద్రవ్యలోటు 4.4 శాతంగా, కరెంట్ ఖాతా లోటు 1.2-1.3 శాతంగా ఉంటుందన్నది.

వెల్గనూర్ పాఠశాలకు తాళం వేస్తున్న గుత్తేదారు భర్త

బకాయిలు చెల్లించాలని బడికి తాళం

- భర్తతో కలిసి ఎస్ఎంసీ మాజీ చైర్‌పర్సన్ నిరసన
- పురుగుల మందు డబ్బాతో పాఠశాల గేటు ఎదుటే బైఠాయింపు

దండేపల్లి, జూన్ 18 : పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని, లేదంటే మరణమే శరణ్యమని మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూర్ పాఠశాల ఎస్ఎంసీ మాజీ చైర్‌పర్సన్ గడికొప్పుల విజయ, ఆమె భర్త తిరుపతి తెలిపారు. బుధవారం వారు పాఠశాల గేటుకు తాళం వేసి పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన గుత్తేదారు, ఎస్ఎంసీ మాజీ చైర్‌పర్సన్ విజయ, ఆమె భర్త తిరుపతి వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 'మన ఊరు- మన బడి' పథకంతో పాటు, ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నూతన డైనింగ్ హాల్, టాయిలెట్స్, వాటర్ సంపు, విద్యుత్తు మరమ్మతులు, ప్రహరీ పనులు చేపట్టారు. ఇందుకోసం సుమారు రూ.28 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు రూ.5 లక్షల బిల్లే వచ్చిందని, ఇంకా రూ.23 లక్షలు రావాల్సి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులను విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని, చేసేదేమి లేక పాఠశాల గేటుకు తాళం వేసి ఆందోళన చేసినట్టు తెలిపారు. ఆందోళన చేస్తున్న సమయంలో బీఆర్ఎస్-కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది.

ఆపరేషన్ చేశారు.. సూది మరిచారు!

- హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా దవాఖానలో ఘటన
- దవాఖాన ప్రతిష్ఠ దెబ్బ తీసే కుట్రలంటున్న సూపరింటెండెంట్

హుజూరాబాద్ టౌన్, జూన్ 18: మహిళకు సిజేరియన్ చేసి కుట్లు వేసే సూది (నీడిల్)ని కడుపులోనే మరిచిపోయిన ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో చోటుచేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. మంచిర్యాలకు చెందిన సౌమ్య, సత్యనారాయణ దంపతులు. సౌమ్య ప్రసూతి కోసం జమ్మికుంటలో తల్లిగారి ఇంటికి వచ్చింది. ఈనెల 15న ఉదయం పురిటి నొప్పులు రావడంతో తల్లిదండ్రులు ఆమెను డెలివరీ కోసం హుజూరాబాద్ ఏరియా దవాఖానలో చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆమెకు సిజేరియన్ చేయగా, ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే కుట్లు వేసే సమయంలో దారానికి ఉన్న సూది జారిపోయింది. వెంటనే సిబ్బంది స్పందించి వెతికినా అది దొరక్కపోవడంతో అనుమానం వచ్చి ఎక్స్‌రే తీసి అప్పటికప్పుడే కుట్లు పూర్తి కాకముందే సూదిని తొలగించినట్టు సూపరింటెండెంట్ నారాయణరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే దవాఖాన ప్రతిష్ఠను దెబ్బతీసేలా గోరంత విషయాన్ని కొండంతలుగా చేసి చూపుతున్నారని ఆయన ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తంచేశారు.

విజిలెన్స్.. నాన్‌సెన్స్

- 38 మందికి షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై పలువురు ఇరిగేషన్ శాఖ అధికారుల ఆగ్రహం
- వివరణలు పరిగణనలోకి తీసుకోకుండానే రిపోర్టా..?
- దిగువస్థాయి ఇంజినీర్లతో విచారణ చేయించడం ఏమిటి?
- సాంకేతిక అవగాహన లేకుండా ఇష్టారీతిన వ్యవహరించడంపై పలువురు మండిపాటు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విజిలెన్స్ కమిషన్ తీరుపై రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ అధికారులు రగిలిపోతున్నారు. 38 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం ఇలా వేధింపులకు దిగితే భవిష్యత్‌లో ప్రాజెక్టులేవీ ముందుకుసాగని పరిస్థితి నెలకొంటుందని హెచ్చరిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన విజిలెన్స్ కమిషన్ గత మార్చిలో నివేదిక సమర్పించింది. 17 మంది ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లపై క్రిమినల్ ప్రొసీడింగ్స్, మరో 40 మంది ఇంజినీర్లపై మేజర్ పెనాల్టీ ప్రొసీడింగ్స్ చేపట్టాలని రిపోర్టులో పేర్కొన్నది. ఆ నివేదిక ఆధారంగా ఇంజినీర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. కమిషన్ నివేదించిన రిపోర్టులోని ఇంజినీర్లు అందరికీ కాకుండా 38 మంది ఇంజినీర్లకు షోకాజ్ నోటీసులు జారీచేసింది. విజిలెన్స్ కమిషన్ మోపిన అభియోగాలపై వచ్చే మూడు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఇంజినీర్లను ఆదేశించింది. ఈ చర్యలపై ఇరిగేషన్ శాఖ అధికారులు భగ్గుమంటున్నారు. కమిషన్ తీరుపై, సర్కారు చర్యలపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. వాస్తవంగా విజిలెన్స్ కమిషన్‌లో ఇరిగేషన్, పంచాయతీ, ఆర్అండ్‌బీ తదితర ఇంజినీరింగ్ విభాగాల నుంచి ఇంజినీర్లు ఉండాల్సి ఉన్నది. ఇక విజిలెన్స్ కమిషన్‌లో సీఈ పోస్టుతోపాటు దిగువన ఏఈఈ, జేఈ మొత్తం పోస్టులన్నింటిలోనూ ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లే ఉండాలి. కానీ, ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ నుంచి కమిషన్‌లో ఒకేఒక్క అధికారి ఉండగా మిగతా అన్ని పోస్టుల్లో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీర్లు ఉన్నారు.

నిర్బంధం తరహాలో విచారణ!

మరోవైపు, రాష్ట్రంలోని కాళేశ్వరం ప్రాజెక్టు అతిభారీ ప్రాజెక్టు. చీఫ్ ఇంజినీర్లు, హైపవర్ కమిటీ, స్టేట్‌లెవల్ స్టాండింగ్ కమిటీల్లో సీఈలే ఉన్నారు. అలాంటి ఉన్నత కమిటీలు, సీఈలు రూపకల్పన చేసి, ఆమోదించిన ప్రాజెక్టుపై ఈఈ, డీఈ వంటి దిగువస్థాయి, అందులోనూ ఇరిగేషన్ శాఖతో సంబంధమే లేని పీఆర్, ఆర్అండ్‌బీ అధికారులతో విచారణ చేయించడమే విడ్డూరమని, దానిపై రాష్ట్ర సర్కారు సైతం అనాలోచితంగా చర్యలకు దిగడమేమిటని ఇంజినీర్లు మండిపడుతున్నారు. కమిషన్ పూర్తిగా నిర్బంధం తరహాలో విచారణ కొనసాగించిందని వారంతా చెప్తున్నారు. విచారణకు పిలిచి అప్పటికప్పుడే సమాధానాలు ఇవ్వాలని, అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను సమర్పించేందుకు సమయమివ్వాలని కోరినా పట్టించుకోకుండా, ఏది ఉంటే అదే రాసివ్వాలని పట్టుబట్టిందని వారంత గుర్తుచేశారు. విజిలెన్స్ కమిషన్ సాంకేతిక అంశాలపై విచారణ చేయడం, వాటిపై అనుమానాలు ఉంటే, లోపాలేమైనా కనిపిస్తే సదరు అధికారి నుంచి వివరణలు తీసుకోవడం పరిపాటి అని, అవి సహేతుకంగా ఉంటే అభియోగాలను తొలగించడం రొటీన్‌గా కొనసాగుతుందని ఆ అధికారులు చెప్తున్నారు. కానీ, విజిలెన్స్ కమిషన్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని, అభియోగాలు మోపడమే లక్ష్యంగా ముందుకుపోతున్నదని, ఎన్నిసార్లు ఆధారాలతో వివరణలు ఇచ్చినా వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని ఇంజినీర్లు మండిపడుతున్నారు. ఇవేవీ పట్టించుకోకుండా కమిషన్ మోపిన అభియోగాలపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వం షోకాజ్ నోటీసులివ్వడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సర్కారు తీరు మారకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, పనులు చేయడానికి ఇంజినీర్లు ముందుకురాని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు.

సమగ్ర విత్తన చట్టం తేవాలి

- సుప్రీంకోర్టు హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ నవాబ్‌సింగ్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తేతెలంగాణ): దేశంలో సమగ్ర విత్తనచట్టం తేవడం ద్వారానే రైతులకు న్యాయం జరుగుతుందని సుప్రీంకోర్టు హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ నవాబ్‌సింగ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని రైతు కమిషన్ అన్నదాతల సంక్షేమం కోసం అవసరమైన సూచనలను సీల్డ్‌కవర్ ద్వారా అందజేయాలని పేర్కొన్నారు. పంజాబ్ రైతుల సమస్యలపై సుప్రీంకోర్టు గతంలో వేసిన హైపవర్ కమిటీ సమావేశం బుధవారం హర్యానాలోని పంచకుల నగరంలో జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, విత్తన చట్టం కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో హైపవర్ కమిటీ తెలంగాణ రాష్ట్రంలో రైతు సమస్యలు, ప్రభుత్వ పథకాలు, ప్రధాన పంటలపై సుదీర్ఘంగా చర్చించారు. ములుగు విత్తనోత్పత్తి ఘటనపై కూడా హైపవర్ కమిటీ ఆరా తీసింది. ములుగులో మల్టినేషనల్ విత్తన కంపెనీల మోసాలపై హైపవర్ కమిటీ దృష్టికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తీసుకొచ్చారు. సమావేశంలో కమిటీ సభ్యులు దేవేందర్‌శర్మ, సూక్పాల్ సింగ్ పాల్గొన్నారు.

010 పద్దు ద్వారా వేతనాలివ్వాలి

మాడల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : మాడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలని రాష్ట్ర మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బుధవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, శంకర్‌నాయక్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. హెల్త్‌కార్డులు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని అసోసియేన్ ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఇద్దరు అధికారులకు జైలు

- ఐఏఎస్ అరవింద్‌కుమార్, మరో అధికారి ప్రసూనాంబకు 2 వారాలపాటు జైలు శిక్ష
- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు తీర్పు

హైదరాబాద్, జూన్ 18, (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ చర్యల్లో భాగంగా ఎస్ రాంరెడ్డి అనే యజమాని నుంచి సేకరించిన భూమికి ప్రత్యామ్నాయంగా స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని గతంలో ఇచ్చిన హామీని అమలు చేయని ఐఏఎస్ అధికారితోపాటు మరో అధికారికి హైకోర్టు జైలు శిక్షను విధించింది. సేకరించిన భూమికి ప్రత్యామ్నాయంగా భూమిని కోల్పోయిన యజమానికి 2016లో కేటాయించిన 666.67 చదరపు గజాల ప్లాటును రిజిస్ట్రేషన్ చేస్తామని పలుమార్లు ఇచ్చిన హామీని అమలు చేయలేదన్న కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో ఈ ఉత్తర్వులను జారీచేసింది. గత మధ్యంతర ఉత్తర్వులను మూడు నెలల్లో యజమానికి ప్లాటును రిజిస్ట్రేషన్ చేసివ్వకపోతే ప్రతివాదులైన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా గతంలో చేసిన అరవింద్ కుమార్, భూసేకరణ అధికారిగా చేసిన మరో అధికారి ప్రసూనాంబకు రెండు వారాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. రూ.1000 చొప్పున జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో వారం పాటు అదనంగా జైలు జీవితాన్ని గడపాలని షరతు విధించింది. ఈ మేరకు జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి తీర్పు వెలువరించారు. మూసీ నది సుందరీకరణ కోసం భూసేకరణ జరిపినప్పుడు ఉప్పల్ భగాయత్‌లో ఎస్ రాంరెడ్డి భూమిని కోల్పోయారు. ఆయనకు కేటాయించిన ప్లాటు రిజిస్టర్ చేయించాలని గత ఫిబ్రవరిలో హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. వాదనలనంతరం తాజా తీర్పునిచ్చింది.

సిట్‌కు డీజీపీ రాతపూర్వక వాంగ్మూలం?

- అదే బాటలో ఇంటెలిజెన్స్ మాజీ డీజీ అనిల్‌కుమార్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్న సిట్‌కు డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ మాజీ డీజీ అనిల్‌కుమార్ లిఖితపూర్వకంగా తమ వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. ఇటీవల సిట్ విచారణ ఎదుర్కొన్న ప్రభాకర్‌రావు ఇచ్చిన సమాచారం మేరకు.. అప్పటి హోమ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న జితేందర్, అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన ఏడీజీ అనిల్‌కుమార్ సిట్ లేవనెత్తిన సందేహాలను తమ సమాధానంలో నివృత్తి చేసినట్టు సమాచారం. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో అప్పటి రివ్యూ కమిటీలో డీజీపీ జితేందర్, ఏడీజీ అనిల్‌కుమార్ కీలక సభ్యులుగా ఉన్నారు. ఇదే కేసులో నాడు డీజీపీగా ఉన్న మహేందర్‌రెడ్డి, సీఎస్‌గా ఉన్న సోమేశ్ కుమార్ సైతం సిట్ విచారణను ఎదుర్కోనున్నట్టు తెలిసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో రెండో నిందితుడిగా ఉన్న ప్రణీత్‌రావు బుధవారం సిట్ విచారణకు హాజరయ్యారు.

అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : జేఏసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ) : దేవాదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేవాదాయ అర్చక ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు బుధవారం ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ వెంకట్రావును కలిశారు. పెండింగ్‌లో ఉన్న అర్చక వెల్ఫేర్ బోర్డు లబ్ధిదారుల సహకారాన్ని అందించేందుకు కమిషనర్ వెంకట్రావు ఒప్పుకోవడంపై వారు హర్షం వ్యక్తంచేశారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): టెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి.తొలిరోజు పేపర్-2 గణితం, సైన్స్ పేపర్లకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 72.45 శాతం, మధ్యాహ్నం 72.6 శాతం మంది హాజరైనట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు.